

పక్కాగా ఆరోగ్య సర్వేలు: డీఎంహెచ్‌వో

జియ్యమ్మవలస/కురుపాం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆరోగ్య సర్వేలు పక్కాగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. శుక్రవారం జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం, కురుపాం మండలం నీలకంఠపురం పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య పరీక్షల రికార్డులు, మందుల నిల్వలు పరిశీలించారు. క్యాన్సర్, క్షయ, కుష్ఠ లక్షణాలతో గుర్తించిన వారికి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

అభివృద్ధి.. సంక్షేమానికి పెద్దపీట







- రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం
- వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాలకు భారీగా నిధుల కేటాయింపు
- సూపర్ సిక్స్ పథకాల అమలుకు రంగం సిద్ధం
- జిల్లాలో తోటపల్లి జలాశయానికి రూ.47.80 కోట్లు
- వీఆర్ఎస్ ప్రాజెక్టుకు రూ.4.46 కోట్లు
- బాసంగి సమస్య పరిష్కారానికి గ్రీన్‌సిగ్నల్
- అన్నదాత సుఖీభవతో 'మన్యం'లో లక్ష మందికి లబ్ధి
- ప్రజా బడ్జెట్‌పై జిల్లావాసుల హర్షం

తోటపల్లి జలాశయం

పార్వతీపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శుక్రవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3.22 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొచ్చారు. వ్యవసాయం, పంటల బీమా, ఆదరణ, ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం, ఎన్టీఆర్ జలసిరి, సాగునీటి ప్రాజెక్టులు, వైద్య శాఖ, ప్రజా రోగ్యానికి పెద్దపీట వేశారు. రైతు లకు వడ్డీలేని రుణం, పంటల బీమా పథకం అమలు, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ.. అర్హులైన రైతులు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ కింద లబ్ధి చేకూరేలా.. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టారు. మొత్తంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట..

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.47.80 కోట్లు కేటాయించారు. పెండింగ్ పనులు కోసం రూ.32 కోట్లు, భూసేకరణ కోసం 6.75 కోట్లు బాసంగి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రూ.8.45 కోట్లు మంజూరు చేశారు. అదేవిధంగా వెంగళరాయ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.4.46 కోట్లు, ఎన్టీఆర్ జలసిరి పథకానికి బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించారు.



వివిధ రంగాలకు కేటాయింపులు ఇలా..

- వైద్య ఆరోగ్యశాఖ కోసం రూ.19,264 కోట్లు కేటాయించారు. దీంతో పెండింగ్ ఆసుప త్రుల భవన నిర్మాణ పనులతో పాటు ఆసుపత్రుల ఆధునికీకరణ పనులు పూర్తవుతాయని చెప్పవచ్చు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షల వైద్యం అందించనున్నట్లు బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఇక ఉద్యానశాఖ పెండింగ్ భవన నిర్మాణాలకు కూడా అధిక ప్రాధాన్యం ఇచ్చారు.
- జలజీవన్ మిషన్ పథకం కోసం..

(మిగతా 8వ పేజీలో...)



వీఆర్ఎస్ ప్రాజెక్టు

కష్టకాలంలో ఉన్నప్పటికీ..



విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేయటం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రం కష్టకాలంలో ఉన్నా.. ప్రజలకు ఉపయోగపడేలా బడ్జెట్ రూపొందించడం సీఎం చంద్రబాబుకే సాధ్యం. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ, తోటపల్లి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం హర్షణీయం.

- గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన శాఖ మంత్రి

సంక్షేమమే లక్ష్యంగా..



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు బడ్జెట్‌ను రూపొందించారు. వ్యవసాయ, వైద్య ఆరోగ్యశాఖ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, ఎస్సీ, బీసీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం హర్షణీయం. ఆదరణ పథకం పునఃప్రారంభించడం ఆనందంగా ఉంది.

- తోయక జగదీశ్వరి, ప్రభుత్వ విప్, కురుపాం

సాంకేతిక పరిజ్ఞానంతో

కేసుల దర్యాప్తు

- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ మాధవరెడ్డి



6లో

జన్‌మన్ గృహ నిర్మాణాలు

వేగవంతం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి



6లో

ఏడాదికి మూడు పంటలు లక్ష్యం

- అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం

పార్వతీపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏటా మూడు పంటలు లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏపీసీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో సమీక్షించారు. ఏడాదిలో మూడు పంటలకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా సాగునీరు, ఉపాధి హామీ కింద ఫారంపాండ్స్ చెక్‌డ్యామ్‌లు, చెరువుల పునరుద్ధరణ వంటి పనులు చేపట్టవచ్చని తెలిపారు. వాటికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి తమకు అందజేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై గామ, మండల, క్లస్టర్ స్థాయిలో రైతులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేవలం వ్యవసాయం కాకుండా అనుబంధ రంగాలపై కూడా అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షన్ముఖరాజు, ఉద్యాన శాఖాధికారి బి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరులోగా పూర్తిచేయండి

ఉపాధి హామీ పనులన్నీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గతనెలలో రూ.26 కోట్ల మేర పనులు పూర్తి చేశారని, వాటి బిల్లులను త్వరగా అందజేయాలని సూచించారు. ఈ నెలలో ఐటీడీఏ, పీఆర్, పీఐయూ ద్వారా రూ. 37 కోట్లు పనులను పూర్తి చేయాలన్నారు. పీఎం గ్రామ సడక్‌యోజన-4కు జిల్లా ఎంపికైందని కలెక్టర్ తెలిపారు. దీని ద్వారా 250 మంది జనాభా ఉన్న గ్రామాలకు ఏడాది పొడవునా రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన అంచనాలు రూపొందించి మార్చి 10లోగా అందించాలని ఇంజనీర్లను ఆదేశించారు.



పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సస్పెన్షన్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సస్పెండ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. శనివారం ఉదయం ఏడు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని , లబ్ధిదారులతో మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలో 1.48 లక్షల మందికి పింఛన్ల రూపంలో ప్రభుత్వం రూ.59 కోట్ల అందిస్తుందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఎక్కడా తలెత్తకుండా ముందస్తుగా క్రాష్ ప్రోగ్రాం చేపట్టి.. ఈ నెల 15 నాటికి పూర్తి చేయాలన్నారు. సీతంపేట మండలంలో పది, భామిని మండలంలో రెండు గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు.

వైభవంగా చక్రతీర్థ స్నానాలు



6లో

పూతికవలసలో గజరాజులు

అమ్మో.. జరడ ఘాట్ రోడ్డు

- విరిగి పడుతున్న కొండ చరియలు
- ఇబ్బందులు పడుతున్న పది గ్రామాల గిరిజనులు

8లో

కల్పవల్లి.. కనకమహాలక్ష్మి

- రేపటి నుంచి అమ్మవారి 27వ జాతర ఉత్సవాలు



6లో

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- పకడ్బందీగా ఏర్పాట్లు
- 34 కేంద్రాల్లో పరీక్షలు
- నేటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహణ
- హాజరుకానున్న 17,849 మంది విద్యార్థులు
- అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు.. సెల్‌ఫోన్లు నిషేధం

బెలగాం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అధికారులు సర్వం సిద్ధం చేశారు. శనివారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 34 కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలు, సాంఘిక సంక్షేమ, ప్రైవేటు జూనియర్ కళాశాలలున్నాయి. వాటిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా 17,849 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం 8,968 మంది, ద్వితీయ సంవత్సరం 8,881 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో బాలురు 9412 మంది, బాలికలు 8371 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ముగ్గురు సభ్యులతో కూడిన 2 ఫ్లైయింగ్ స్క్వాడ్, 2 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వారితో పాటు ఒక స్పెషల్ ఆఫీసర్, డీఈసీ తదితరులు పరీక్షల తీరును పర్యవేక్షించనున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి అధికారులు, ఇన్విజిలేటర్లు, పోలీస్, స్క్వాడ్ అధికారులు, వైద్య, ఇతర సిబ్బంది సెల్‌ఫోన్లు , ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లరాదు. పరీక్షల విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలి. కాగా పరీక్షల వాటి సమాచారం అందించేందుకు కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశారు. దీనిపై శుక్రవారం ఇంటర్ మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి మంజులవీణ విలేఖర్లతో మాట్లాడుతూ.. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తారని తెలిపారు. నిర్దేశిత సమయానికి కంటే ముందుగానే అందరూ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అన్నిచోట్లా ఫర్నిచర్, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్, ఇతర అవకతవకలకు వీలులేకుండా కేంద్రాల్లో 461 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అమరావతిలోని ప్రధాన కార్యాలయం, జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయాలతో అనుసంధానంగా అవి పని చేస్తాయని చెప్పారు. పరీక్షలు జరిగే సమయాల్లో విద్యుత్‌కు అంతరాయంగా కలగకుండా ఆయా శాఖాధికారులతో చర్చించామని వెల్లడించారు.



మాట్లాడుతున్న ఇంటర్ జిల్లా విద్యాశాఖాధికారి మంజులవీణ



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేసిన దృశ్యం

సరికొత్తగా బడి భోజనం

- విద్యార్థులకు పూర్తిస్థాయిలో పోషకాహారం
- పాఠశాలల్లో మారనున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ
- నేటి నుంచి అమలు
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి మధ్యాహ్న భోజన పథకం మెనూ మారనుంది. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిధిలో 1,583 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 1,18,547 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు 39,903 మంది, 6 నుంచి 10వ తరగతి వరకు 54,099 మంది ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు హాజరవుతున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వారందరికీ మారిన మధ్యాహ్న భోజనం అందించనున్నారు. మారిన మెనూ ప్రకారం.. ప్రతి సోమవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడక బెట్టిన గుడ్డు, చక్కీ అందించనున్నారు. గతంలో కూరగాయల పలావ్, గుడ్డు కూర, చక్కీ, పులిహోర, టమాటా పచ్చడి, రాగి జావ అందించేవారు. మంగళవారం అన్నం, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు అందించగా.. ఇకపై అన్నం, గుడ్డు కూర, రసం, రాగి జావ అందించనున్నారు. బుధవారం కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మ, ఉడికించిన గుడ్డు, చక్కీ అందించేవారు. ఇక మీదట వెజ్ పలావ్, బంగాళదుంప కుర్మ, ఉడికించిన గుడ్డు, చక్కీ అందిస్తారు. గురువారం సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, పులిహోర, టమాటా చట్నీ, రాగి జావ అందించగా.. మారిన మెనూ ప్రకారం.. అన్నం, సాంబారు, గుడ్డు కూర, రాగి జావ అందించనున్నారు. శుక్రవారం ఉడికించిన గుడ్డు, చక్కీ, ఆకుకూర అన్నం, పప్పుచారు అందించేవారు. ఇకపై పులిహోర, చట్నీ, గోంగూర, తదితర కూరగాయల చట్నీ, ఉడికించిన గుడ్డు ఇవ్వనున్నారు. శనివారం తీపి పొంగలి, రాగి జావ అందించేవారు. ఇకమీదట అన్నం, కాయగూరల కర్రీ, రసం, రాగి జావ, తీపి పొంగలి అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో రక్తహీనతకు గురికాకుండా పూర్తిస్థాయి పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

జోన్-1గా ఆరు జిల్లాలు గుర్తింపు

జోన్-1లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతా రామరాజు, అనకాపల్లి జిల్లాల్లో నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నూతన మెనూ అమలు చేయాలని మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర డైరెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు హెచ్‌ఎంలు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లకు ఆదేశాలు జారీ చేశాం. మధ్యాహ్న భోజనం నూతన మెనూ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి లోపాలు జరగకుండా చూస్తాం.

- నల్ల తిరుపతినాయుడు, డీఈవో, పార్వతీపురం మన్యం



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న డీఈవో (ఫైల్)

కల్పవల్లి.. కనకమహాలక్ష్మి

● రేపటి నుంచి అమ్మవారి 27వ జాతర ఉత్సవాలు


కనకమహాలక్ష్మి అమ్మవారు


అమ్మవారి ఆలయం

చీపురుపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో శ్రీకనకమహలక్ష్మి అమ్మవారి 27వ జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. దీనికోసం ఇప్పటికే ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదేశాల మేరకు నిర్వహణ కమిటీ జాతర ఏర్పాట్లను చేస్తోంది. తొలి రోజైన ఆదివారం వేకువ జామున ఒంటి గంటకు ఆలయాన్ని తెరిచి తొలి పూజ నిర్వహిస్తారు. ఉదయాన్నే సంప్రదాయం ప్రకారం నేత్రోత్సవం జరిపిస్తారు. ఏడు గంటల నుంచి జంగిళ్లతో పాలధారోత్సవం, మధ్యాహ్నం మూడు గంటల నుంచి అమ్మవారి ఘటాలు, ప్రభలతో ఊరేగింపు నిర్వహిస్తారు. భారీ శోభాయాత్రతో ప్రభ జాతర జరుగుతుంది. రెండో రోజైన సోమవారం తొలేళ్ల ఉత్సవం, సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. మూడోరోజైన మంగళవారం ఘటోత్సవంతో పాటు పట్టణంలో ఉన్న కోటదుర్గమ్మ, అసిరితల్లి, భగీరథమ్మ, సిర్లి యల్లమాంబ, సంతానలక్ష్మి అమ్మవార్లకు భక్తులు పసుపు కుంకుమ సమర్పిస్తారు. అలాగే జాతరకు వచ్చే భక్తుల కోసం నిర్వహకులు మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

ఆకట్టుకోనున్న విద్యుద్దీపాలంకరణ..

జాతర పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయం వరకూ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. టీటీడీ కల్యాణ మండపం, గెడ్డ మిల్లు, అమ్మవారి ఆలయానికి వెళ్లే ప్రధాన ఆర్చిల వద్ద ప్రత్యేకంగా అందమైన సెట్లు వేస్తున్నారు.

ఇవే టికెట్ ధరలు..

భక్తుల కోసం నాలుగు స్థాయిల్లో టికెట్ ధరలు నిర్ణయించినట్టు ఆలయ ఈవో బి. శ్రీనివాస్ తెలిపారు. ఉచిత దర్శనంతో బాటు 100, 50, 20, 10 రూపాయల టికెట్లు తీసుకుని అమ్మవారిని దర్శించుకోవచ్చునన్నారు. ఆలయ ప్రాంగణంలో అత్యవసర సర్వీసులు 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తు

● నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ మాధవరెడ్డి



బెలగాం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టి పెండింగ్ కేసులను త్వరతగతిన పూర్తి చేయాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ నేర సమీక్షా సమావేశం ఎస్పీ మాధవరెడ్డి నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, చీటింగ్, గంజాయి, తదితర కేసులపై సమీక్షించారు. హిస్టరీ షీట్ ఓపెన్ చేయాలని, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. తరుచూ నేరాలకు పాల్పడే వ్యక్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని బైండోవర్ చేసి ఎంఈఎం కోర్టులో హాజరుపరచాలని సూచించారు. డిజిటల్ అరెస్టులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930కు లేదా సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేసేలా చూడాలని ఆదేశించారు. గంజాయి రవాణా నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలని తెలిపారు. రాత్రిపూట అన్ని స్టేషన్‌ల్లో గస్తీ ముమ్మరం చేయాలని, అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న ముద్దాయిలను అరెస్ట్ చేయాలని, మహిళా సంబంధిత నేరాల మీద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని, బ్లాక్ స్పాట్స్ గుర్తించి వాటి వద్ద స్టాపర్స్ ఏర్పాటు చేయాలని, రద్దీ ప్రదేశాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురానా, పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రతీర్థ స్నానాలు

భామిని, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సొలికిరి ఉమాసహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పాడ్యమి సందర్భంగా స్వామివారి చక్రతీర్థ స్నానాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా వంశధార నదికి తీసుకెళ్లారు. శివపార్వతుల విగ్రహాలకు వేదమంత్రాల నడుమ పుణ్య స్నానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు నది వద్దకు చేరుకుని, స్నానాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు.


వంశధారలో చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న దృశ్యం

పూతికవలసలో గజరాజులు

● ఆందోళనలో రైతులు


పూతికవలస సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

కురుపాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కురుపాం పంచాయతీ పూతికవలస గ్రామ సమీపంలో గల పామాయిల్, అరటి తోటల్లో శుక్రవారం ఏనుగుల గుంపు సంచరించింది. ఇంతవరకు జియ్యమ్మవలస, కొమరాడ మండలంలో సంచరించిన ఏనుగులు కురుపాం సమీపంలో గల పూతికవలస చేరుకున్నాయి. జనవరి 30వ తేదీన పూతికవలస, సీతంపేట గ్రామాలలో గల కర్బూజ పంటను నాశనం చేశాయి. వెంటనే వెనుతిరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఇప్పుడు సంచరించడంతో భయాందోళన చెందుతున్నారు. అటవీ అధికారుల వెంటనే స్పందించి తమ గ్రామాల నుంచి ఏనుగులను తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన జాతీయ సదస్సు


సావనీర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖులు

రాజాం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంఆర్ ఐటీలో రెండ్రోజులుగా నిర్వహించిన స్టైప్‌కాన్ జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 3884 మంది విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. వీరిలో 165 మంది విద్యార్థులు సాంకేతిక పత్రాలను సమర్పించారు. 443 మంది వర్క్‌షాప్‌లో, 106 మంది ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో, 81 మంది స్టార్టప్ ఐడియాస్ పోటీలో, 44 మంది జీపీఎల్ వంటి పోటీలు, ఈవెంట్లలో పాల్గొన్నారు. ఆయా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రసాద్ పాల్గొన్నారు. ఐఎస్‌టీఈ చాప్టర్ స్టైప్‌కాన్ సావనీర్‌ను విడుదల చేశారు.

గాడిన పడేదెప్పుడో?

● విధి నిర్వహణలో సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం
● ఉన్నతాధికారుల తనిఖీల్లో దుమ్మా కొడుతున్న వైనం
● 12 మంది ఉద్యోగులకు మెమోలు జారీ


తనిఖీల సమయంలో రామభద్రపురం సచివాలయం-2లో లేని సిబ్బంది (ఫైల్)

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు చాలా మంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారు. సమయపాలన పాటించడం లేదు. పనులను జాప్యం చేస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సరిగా తీసుకోవడం లేదు. ఈ అంశాలను తనిఖీల్లో ఉన్నతాధికారులు గుర్తించారు. ఈనెలలో జిల్లా వ్యాప్తంగా నలుగురు పంచాయతీ కార్యదర్శులు, ఇద్దరు డీఏలు, ఒక వార్డు అడ్మిన్, ఒక వార్డు వెల్ఫేర్ సెక్రటరీ, ఇద్దరు వెల్ఫేర్ అసిస్టెంట్లు మొత్తం 12 మంది ఉద్యోగులకు వివిధ కారణాలతో మెమోలు ఇచ్చారు. ఒకే నెలలో 12 మంది ఉద్యోగులకు మెమోలు ఇవ్వడం చర్చనీయాంశమైంది. గ్రామ, వార్డుల్లో సేవలు అందించేందుకు సచివాయాలను గత ప్రభుత్వం 2019లో ఏర్పాటు చేసింది. జిల్లాలో 620 సచివాలయాలున్నాయి. 530 గ్రామ సచివాలయాలు, 96 వార్డు సచివాలయాలు ఉండగా వీటిల్లో దాదాపు ఆరువేల మంది వరకూ పని చేస్తున్నారు. ప్రతి రోజు వారు ఉదయం 10 గంటలకు బయోమెట్రిక్ వేసి విధులకు హాజరు కావాలి. సాయంత్రం ఐదు గంటలకు విధులు ముగిసిన తరువాత తిరిగి బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. కొందరు ఉద్యోగులు బయోమెట్రిక్ వేసిన తరువాత వేరే పనులపై దృష్టి పెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రభుత్వం అప్పగిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వే, జియో కోఆర్డినేటింగ్ సర్వేను సక్రమంగా చేయకపోవంతో పాటు ఆధార్ సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో బయటపడింది. సచివాలయ ఉద్యోగులను పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు విధుల నిర్వహణలో అలసత్వంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రెవెన్యూ కార్యదర్శులు, సర్వేయర్లు ఫీల్డ్ పేరుతో సక్రమంగా బయోమెట్రిక్ వేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై డీఎల్‌డీవో రోజారమణి వద్ద ప్రస్తావించగా ఉద్యోగుల పనితీరు మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటున్నామని, నిత్యం సచివాయాలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

- ఈ నెల7న మధ్యాహ్నం 12 గంటల 40 నిమిషాలకు రామభద్రపురం గ్రామంలోని రెండో సచివాలయాన్ని డీఎల్‌పీవో ఎ.మోహనరావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం కోర్డినేటర్ అశోక్‌కుమార్‌లు తనిఖీ చేశారు. ఆ సమయంలో సచివాలయం తలుపులు తీసి ఉన్నా ఉద్యోగులు ఎవరూ లేరు. దీంతో గ్రామ కార్యదర్శికి ఫోన్ చేయగా వేరే ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లినట్లు చెప్పారు. ఇదే సమయంలో ఓ రైతు తన సమస్యను చెప్పుకోవడానికి వచ్చారు. ఈ నేపథ్యంలో తనిఖీకి వెళ్లిన ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేశారు.
- ఈనెల 11న పూసపాటిరేగ మండలంలోని గోవిందపురం, చింతపల్లి సచివాయాలకు చెందిన ఉద్యోగులతో విజయనగరం డివిజనల్ డవలప్‌మెంట్ అధికారి రోజారమణి, జిల్లా కోఆర్డినేటర్ అశోక్ కుమార్‌లు సమీక్ష నిర్వహించారు. చింతపల్లి సచివాలయం-1లో హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, మిస్సింగ్ సిటిజన్ అంశాలపై పెండెన్సీ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కారణం గ్రామ పంచాయతీ సెక్రటరీ ఉద్యోగులపై సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడమే. దీంతో ఆ కార్యదర్శికి మెమో జారీ చేశారు.
- కొద్ది రోజులు క్రితం విజయనగరం పట్టణంలోని బాబామెట్ట వార్డు సచివాలయంలో పని చేస్తున్న వార్డు వెల్ఫేర్ సెక్రటరీ మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విధులకు హాజరు కాకపోవడంతో ఆయనకు కూడా మెమో జారీ చేశారు.

జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం

● 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు
● కేంద్రం నిధులు.. స్థల పరిశీలన పూర్తి

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్థలం కేటాయించాల్సి ఉంది. వ్యవసాయశాఖ, ఏరువాక విభాగం అధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు స్థల పరిశీలన చేసి కలెక్టరు అంబేడ్కర్‌కు నివేదిక ఇచ్చారు. బొండపల్లి మండలం అంబటివలస వద్ద 50 ఎకరాల్లో ఈ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. కలెక్టరు ద్వారా ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి చేరాయి. అసెంబ్లీలో శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు వ్యవసాయరంగ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడు కృషి విజ్ఞాన కేంద్రం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలోని కుప్పం, విజయనగరం, నర్సారావుపేట, బాపట్ల తదితర జిల్లాల్లో తొలిదశలో ఈ కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు ప్రక్రియ ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుందని స్పష్టం చేశారు.


బొండపల్లి మండలం అంబటివలస వద్ద ఏర్పాటు కానున్న కృషి విజ్ఞానకేంద్రంనకు సంబంధించిన స్థల పరిశీలన చేస్తున్న జిల్లా అధికారులు, ఏరువాక శాస్త్రవేత్తలు

కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటైతే..

జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటైతే వ్యవసాయం దాని అనుంబంధ రంగాలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం జిల్లాలో గాజులరేగలోని ఏరువాక కేంద్రం ఉంది. దీనిద్వారా రైతులకు సేవలు అందుతున్నాయి. కృషి విజ్ఞాన కేంద్రం వస్తే ఏడుగురు శాస్త్రవేత్తలు వస్తారు. ముగ్గురు వ్యవసాయ రంగానికి సంబంధించి.. పశు సంవర్ధకశాఖ, ఉద్యానవనశాఖ, హోం సైన్సుకి సంబంధించి ఒక్కొక్కరు చొప్పున శాస్త్రవేత్తలు ఉంటారు. వీరు ఆయా రంగాల్లో నిత్య పరిశోధనలతో పాటు, ఎప్పటికప్పుడు అధికారులకు, రైతులకు శిక్షణ ఇస్తారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విప్లవాత్మకమైన మార్పులను తెలియజేస్తారు.

జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతం

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

భామిని, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదే శించారు. శుక్రవారం మనుమ కొండలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అన్ని వీధులు తిరిగి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం గిరిజనులతో మాట్లాడారు. గ్రామస్థులకు ఉపయోగపడే ఉపాధి యూనిట్ కోసం చర్చించారు. నీతి అయోగ్ మనుమకొండను ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న వారికి ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. కొత్తగా గ్యాస్ కనెక్షన్లు ఇప్పిస్తామని తెలిపారు. కొత్తూరుగూడ నుంచి మనుమ కొండకు రహదారి సౌకర్యం, వీడీవీకే సభ్యులకు పేపర్‌ప్లేట్ యంత్రం మంజూరుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆ తర్వాత అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులతో ముచ్చటించారు. వారికి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. చిన్నారులకు పంపిణీ చేస్తున్న గుడ్లు, భోజనాలను పరిశీలించారు. బాలుర ఆశ్రమ పాఠశాల, బత్తిలి పీహెచ్‌సీని కూడా సందర్శించారు. ఓపీ రిజిస్టర్, ప్రసవాలపై ఆరా తీశారు. సింగిడి గ్రామంలో రక్షిత నీటి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. జేజేఎం పథకం ద్వారా రూ.60 కోట్లతో 45 వాటర్ ట్యాంకులు, 72 కిలోమీటర్ల మేర పైపులైన్‌తో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు చెప్పారు. మొత్తంగా 54 గ్రామాల్లో 44,093 మందికి తాగునీరు సరఫరా చేస్తామన్నారు.


మనుమకొండలో స్థానిక అధికారులతో మాట్లాడుతున్న పీవో

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

● కలెక్టర్‌తో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సరఫరాకు వేసవి కార్యాచరణ రూపొందించాలన్నారు. నీటి కొరత వల్ల వనరులు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తాలు పంపిణీని ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎంఎస్ఎంఈ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

'తెలుగు భాషపై ప్రభుత్వ శ్రద్ధ హర్షణీయం'

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో తెలుగు భాష అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించడం పట్ల విజయనగరం ఎంపీ అప్పలనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఇలాంటి చొరవ వల్ల రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి ఉపయోగపడుతుందన్నారు. తెలుగు భాష, సంస్కృతి, తెలుగు సినిమా పాటలపై ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తున్న సీఎం చంద్రబాబు కు ధన్యవాదాలు తెలిపారు. తెలుగును గత ప్రభుత్వం విస్మరించిందని కలిశెట్టి మండిపడ్డారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఫూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే దాసన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. సింగపూర్ సిటీ, జమ్ము, నారాయణపురం, పడాలపేట, ఆనందపురం, బ్యాంకు కాలనీ, తాడివాడ, సీఆర్ నగర్‌లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన తెలిపారు.

క్లోరిన్ పరీక్షలు చేస్తున్నాం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన క్లోరిన్ పరీక్షలను చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. శుక్రవారం తోటపాలెంలో సరఫరా చేస్తున్న తాగునీటిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లోరిన్ పరీక్షలను ఆయన నిర్వహించారు. దీంతో రక్షిత తాగునీరు సరఫరా జరుగుతున్నట్టు ఆయన గుర్తించారు.

నేటినుంచి పశువులకు గాలికుంటు టీకాలు

చీపురుపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పశువులకు శనివారం నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్టు పశు సంవర్థక శాఖ ఏడీ డా.ఆర్.శారద ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి 31 వరకూ టీకాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

రహదారి ఏర్పాటు చేయండి

కొత్తవలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని నాయిబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన కమ్యూనిటీ భవనానికి రహదారిని ఏర్పాటు చేయాలని సామాజికవర్గ నాయకులు శుక్రవారం ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీపీ, కొత్తవలస సర్పంచ్ మచ్చ రామస్వామితో పాటు పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడును సంబంధిత ప్రాంతానికి తీసుకెళ్లి సమస్యనుచూపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొరపల్లి జయప్రకాశ్ ఉన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో వర్క్‌షాప్

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం ఇంప్లిమెంటేషన్ సపోర్టు ప్రోగ్రాంపై వర్క్‌షాప్ నిర్వహించారు. క్లినికల్, నాన్ క్లినికల్ వైద్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు పద్మలీల, కో-ఆర్డినేటర్ పి.ఎ.రమణి, ఎన్ఎంసీ పరిశీలకురాలు జి.రాజ్యలక్ష్మీబాయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.45 శాతం ఓటింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ప్రిసైడింగ్ అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం 92.45 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,794 మంది (92.45శాతం) ఓటు వేశారు. పురుషులు 13,508 మందికి 12,576 మంది, మహిళలు 8,985కి 8,216 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు.

డ్రగ్స్ కేసుల్లో నిందితులపై హిస్టరీ షీట్ తెరవండి


జూమ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలో దర్యాప్తులోని గంజాయి, మాదక ద్రవ్యాల కేసుల్లో నిందితులపై హిస్టరీ షీట్‌ను ప్రారంభించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి కేసుల్లో నమూనాలను త్వరితగతిన ఆర్ఈఎల్‌కు పంపాలని ఆదేశించారు. ఈ చట్టం ప్రకారం నమోదైన కేసులు, సోషల్ మీడియా కేసుల విషయమై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దర్యాప్తులోని కేసుల్లో పెండింగ్‌లోని నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. కేసుల విచారణలో వెలుగులోకి వచ్చిన సమాచారంతో అక్రమ రవాణాకి కారకులైన వారిని, విక్రయించిన వారిని, మధ్యవర్తులుగా వ్యవహరించే వారిని నిందితులుగా చేర్చాలన్నారు. వారిని అరెస్టు చేయాలని ఆదేశించారు. పరారీలోని నిందితులపై లుకౌట్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు శ్రీనివాసరావు, రాఘవులు, భవ్యరెడ్డి, వీరకుమార్, ఎస్‌బీ సీఐ లీలారావు, శంకరరావుతో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేలు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్‌ల పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా తప్పదని ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. రెండు రోజుల్లో 24 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.2.40 లక్షలు జరిమాన విధించామన్నారు. ఈ తరహా వాహనదారులను కట్టడి చేసేందుకు ప్రతిరోజు నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రత్యేకంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో జేసీ నమోదు


వివరాలు నమోదు చేసుకుంటున్న జేసీ

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు మిస్సింగ్ సిటిజన్ హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో శుక్రవారం జేసీ సేతు మాధవన్ తన వివరాలను నమోదు చేయించుకున్నారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు మ్యాపింగ్ చేశారు. ఈ సందర్భంగాగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

రాజాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొమరపురి రమణ భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆమెను టీడీపీ నాయకుడు కోండ్రు జగదీశ్ శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు కూటమి నాయకులు గురవాన నారాయణరావు, మద్దు హరి, పొన్నాడ భీమేశ్వరరావు. పిల్లా సత్యంనాయుడు ఉన్నారు.

కాపుసంబం విద్యార్థుల విరాళం

గరివిడి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో కాపు సంబం ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.9,486లు విరాళాలు సేకరించి లెప్రసీ సొసైటీ ఫండ్ రైజింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం డి.రాము మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి సామాజిక సేవ అలవరచుకొని మంచి పౌరులుగా ఎదగాలని కోరారు.

దశ దిశ లేని బడ్జెట్

రాజాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు దశ దిశ లేదని రాజాం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్య కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. తొలి బడ్జెట్‌లోనే సంఖ్య ఘనం కేటాయింపులు శూన్యమన్నారు. బడ్జెట్ అంతా డొల్ల అని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారన్నారు. ఇది మంచి ప్రభుత్వం కాదు మంచే ప్రభుత్వం అని తొలి బడ్జెట్‌తోనే నిరూపితం అయ్యిందని విమర్శించారు.

డెయిరీ యూనిట్ పరిశీలన

సంతకవిటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్ల సీతారాంపురం సీఎంఈజీపీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన డెయిరీని ప్రకాశం జిల్లా డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణరావు శుక్రవారం పరిశీలించారు. జిల్లాలో ట్రైనింగ్ నిమిత్తం శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆవులు కొనుగోలు, గడ్డి పెంపకం, దాణా పాల దిగుబడి, డెయిరీ నుంచి వచ్చిన ఆదాయం, ఖర్చులను ఆయన అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీ ఏపీడీ కె.సావిత్రి.. మహిళ సంఘాల పనితీరు, రుణాలతో వారు చేపడుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు.

విద్యార్థులకు పరీక్ష కిట్‌లు

రేగిడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కెంబూరు తిరుమలరావు పరీక్ష కిట్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.తేజోవతి వెంకటేశ్, విద్యా కమిటీ చైర్మన్ కె.రమాదేవి, అప్పలనాయుడు, హెచ్ఎం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కబేళాలకు తరలిస్తున్న పశువుల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పశువులతో పోలీసులు

కొత్తవలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గోశాల నిర్వహణ ముసుగులో పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. మండలంలోని సంతపాలెం గ్రామంలో గోశాల ముసుగులో ఓముఠా పని చేస్తోంది. శుక్రవారం కూడా నకిలీ గోశాల నుంచి పశువులను కబేళాకు పంపించేందుకు సిద్ధంగా ఉంచిన 202 పశువులను కొత్తవలస సీఐ షణ్ముఖరావు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సంతపాలెం శివారు మామిడి తోటలో 202 పశువులను కబేళాకు తరలించేందుకు సిద్ధంగా ఉంచారనే సమాచారంతో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. 202 పశువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. సంతపాలెం గ్రామానికి చెందిన గొటివాడ ఎర్రిబాబుపై కేసు నమోదు చేశామన్నారు. మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్న పశువులను కోర్టులో హాజరు పర్చి సంరక్షణ కోసం గోశాలకు తరలించామన్నారు.

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో భాగంగా రెండు పశువుల వ్యాన్‌లను పట్టుకున్నట్టు పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా బొలేరో వాహనాల్లో 16 పశువులను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

సారాతో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

వేపాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలపాడులో ఇద్దరు మహిళలు సారా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని కొత్తవలస ఎక్సైజ్ సీఐ బి.ఆర్.ఎస్.నాయుడు తెలిపారు. ఈ దాడిలో అదే గ్రామానికి చెందిన లావేటి లక్ష్మి, శెట్టి దేవి సారా తరలిస్తున్నారనే సమాచారం మేరకు మాటు వేసి పట్టుకున్నామన్నారు. దాడిలో వీర్రాజు, ప్రసాద్, పుష్పలత పాల్గొన్నారన్నారు.

రెండు వర్గాల ఘర్షణ: కేసుల నమోదు

సంతకవిటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల సమీపంలో గురువారం సాయంత్రం ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్న ఘటనపై వారిపై రెండు కేసులను నమోదు చేశామని ఎస్ ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఈ రెండు వర్గాల మధ్య ఉన్న పాత కక్షల నేపథ్యంలో కొట్టుకోవడంతో పలువురు గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. మంతిన గణేష్ ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే రౌతు తేజ ఫిర్యాదు మేరకు ఐదుగురు వ్యక్తులతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.49.96 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థానికి హుండీల ద్వారా రూ.49.96 లక్షల ఆదాయం సమకూరింది. శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని శుక్రవారం దేవస్థానం హుండీలను దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ శిరీష ఆధ్వర్యంలో తెరిచారు. హుండీల్లో రూ.49 లక్షల, 96వేల 162, అలాగే 11 గ్రాముల 800 మిల్లీ గ్రాముల బంగారం, 5 కేజీల 960 గ్రాముల వెండిని భక్తులు స్వామివారికి కానుకగా సమర్పించినట్టు గుర్తించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వై.శ్రీనివాసరావు, సిబ్బంది, శ్రీహరి సేవా సంఘం సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ ఏసీ హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

సన్యాసేశ్వరుడి ఆదాయం రూ.15.67 లక్షలు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాచీన శైవక్షేత్రం ధర్మవరం సమీపంలోని సన్యాసేశ్వరస్వామి శివరాత్రి ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. ఆలయ ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన లెక్కింపులో రెండు రోజులకు గానూ రూ.15 లక్షల 67 వేల 732 లభించిందని తెలిపారు. ఇందులో టిక్కెట్లు ఆదాయం రూ.7 లక్షల 80 వేల 692 సమకూరిందన్నారు.

ఘనంగా చక్రతీర్థ స్నానాలు


చక్రతీర్థ స్నానాలు చేయిస్తున్న దృశ్యం

రేగిడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నయ్యపేటలో వెలిసిన శివశక్తి అఖిలాండేశ్వరీదేవి ఉత్సవ మూర్తులకు శుక్రవారం గ్రామస్థులు నాగావళి నదిలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా అమ్మవారిని ముందుగా పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మన్యం జిల్లా బుక్కూరుకు చెందిన మహిళల కోలాటాల ప్రదర్శన అందిరినీ ఆకట్టుకుంది.

క్రైంన్యూస్

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దత్తిరాజేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగర గ్రామంలో పురుగు మందు తాగి శుక్రవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి వివరాల మేరకు.. వంగర గ్రామానికి చెందిన మామిడి పెంటయ్య (47) రోజూ మద్యం తాగి వస్తున్నాడని, కుటుంబ అవసరాలకు తోడ్పడటం లేదని తన భార్య సత్యవతి నిలదీయడంతో వీరిరువురి మధ్య చిన్నపాటి తగాదాలు నడుస్తున్నాయి. ప్రతీ రోజు మాదిరి శుక్రవారం కూడా వీరి మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన పెంటయ్య గ్రామం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. చెరువు వద్ద నురగలు కక్కుకుని ఉన్న పెంటయ్యను వరసకు తమ్ముడు ముద్దాన లక్ష్మణ గుర్తించాడు. సత్యవతికి సమాచారం అందించాడు. దాంతో కుటుంబసభ్యులు పెంటయ్యను గజపతినగరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం 108లో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు తెలిపారు. భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గజపతినగరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిందని ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని పురిటిపెంట గ్రామానికి చెందిన నడుపూరి రాములమ్మ(70)ఉపాధి పనులకు వెళుతుండగా రోడ్డుపై ఎదురుగా వస్తున్న వాహనం ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందిందని తెలిపారు. మృతురాలు మనమరాలు బూర్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

గరివిడి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో గొట్నంది గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో బొడ్డు బండమ్మ (70) తీవ్ర గాయాలపాలైంది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. బండమ్మకు చుట్టలు కాల్చే అలవాటు ఉంది. తన కొడుకు ఇంటిలో ఉంటున్న బండమ్మ ఇంటి లోని ముందు గదిలో పడుకొని ఉంది. రాత్రి కాల్చిన చుట్ట పొరపాటున మంచంపై పెట్టి నిద్రలోకి జారుకుంది. ఆ చుట్ట బండమ్మ వస్త్రాలు, కప్పుకున్న దుప్పటికి తాకడంతో శుక్రవారం తెల్లవారు 4 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో బండమ్మ అరుపులు, కేకలు వేసినప్పటికీ ఆ ఇంటిలో మధ్య గదిలో తలుపులు వేసి నిద్రిస్తున్న కుటుంబ సభ్యులకు వినబడలేదు. దీంతో బండమ్మ ఇంటి బయటకు తలుపులు తీసుకుని వచ్చింది. దాన్ని గమనించిన గ్రామస్థులు మంటలు అదుపులోకి తెచ్చారు. 108 వాహనంలో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం బండమ్మను కుటుంబ సభ్యులు రాజాం దగ్గరలోని రాగోలులో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బండమ్మ శరీరం 80 శాతం వరకు పూర్తిగా కాలిపోయింది. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉంది.

గడసాంలో చోరీ

దత్తిరాజేరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగినట్టు పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. మండలంలోని గడసాం గ్రామంలో తుపాకుల సూరమ్మ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా శుక్రవారం తాళం పగలగొట్టి తలం పావు బంగారం, విలువైన పత్రాలు అపహరణకు గురయ్యాయన్నారు. క్లూస్‌టీం రప్పించి ఆధారాలు సేకరిస్తున్నట్టు ఆమె తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో 2024లో నమోదైన పోక్సో కేసులో నారంశెట్టి ఈశ్వరరావుకు పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నగరంలోని బూర్లెపేటకు చెందిన రిక్షా డ్రైవరు ఈశ్వరరావు (50) విధిగా స్కూల్ పిల్లలను తమ రిక్షాలో స్కూల్‌కి తీసుకుని వెళ్తూ తిరిగి వారిని ఇంటికి తీసుకువచ్చేవాడు. గత ఏడాది నవంబరు 19న ఓ బాలికను స్కూల్‌కు తీసుకుని వెళ్లి తిరిగి ఇంటికి తీసుకువెళ్లే సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళా ఎస్ఐ బి.రేవతి కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు నమోదైన వంద రోజుల్లోనే ప్రాసిక్యూషన్ పూర్తయ్యేలా సీఐ నర్సింహమూర్తి చర్యలు చేపట్టారన్నారు. నేరం రుజువుకావడంతో సదరు వ్యక్తికి.. న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారని ఎస్పీ తెలిపారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి రెండేళ్లు..

బెలగాం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.అరుణ శుక్రవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామానికి చెందిన మీన ప్రభాకర్‌పై అదే గ్రామనికి చెందిన బందలుప్పి రాము పాత కక్షలతో దాడి చేశారని 2022 రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో నేరం రుజువు కావడంతో నిందితుడైన రాముకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.అరుణ తీర్పును వెల్లడించారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్‌కు మంటలు

వేపాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరిగిపాలెంలో మలుపు వద్ద విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డి ట్రాక్టర్‌కు శుక్రవారం నిప్పంటుకుంది. దీంతో ట్రాక్టర్‌పై మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఎస్.కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. గడ్డికి అంటుకున్న వెంటనే డ్రైవర్ ఖాళీ స్థలానికి ట్రాక్టర్‌ను తీసుకు వెళ్లిని గడ్డిని కిందకు తోసే ఏర్పాటు చేశాడు. దాంతో ట్రాక్టర్‌కు ఎటువంటి నష్టం వాటిల్లలేదు.

కుక్కల దాడి: దూడ మృతి

రేగిడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో అంబాడలో గురువారం రాత్రి మజ్జి లక్షుంనాయుడు ఆవు దూడపై కుక్కలు దాడిచేశాయి. దాంతో దూడ మృతి చెందింది. ఇటీవల గొర్రెలు, మేకలపై కుక్కలు తరచూ దాడికి పాల్పడుతుండటంతో అందోళన చెందుతున్నారు.

విజ్ఞాన శాస్త్రం.. మానవ ప్రగతికి మూలం


నెల్లిమర్ల: ప్రదర్శనను తిలకిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ పగడాలమ్మ


పూసపాటిరేగ: ఆర్డర్ పాఠశాలలో ఎంఈవోలు



మాట్లాడుతున్న డీఈవో మాణిక్యంనాయుడు

గజపతినగరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మానవ ప్రగతికి మూలం విజ్ఞానశాస్త్రమని డీఈవో యు.మాణిక్యంనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక బాలుర హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్ చిన్ననాటి నుంచే విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి చూపేవారన్నారు. అనంతరం ఎన్నో పరిశోధనలు చేసి శాస్త్రవేత్తగా దేశ ప్రజల మన్నలు పొందారన్నారు. అనంతరం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు విమలమ్మ, చంద్రశేఖర్, ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

● నెల్లిమర్ల: స్థానిక ఉపాధ్యాయ విద్యా శిక్షణ సంస్థలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు శాస్త్రీయ వైఖరి పెంచుకుని సర్ సీవీ రామన్ ఎఫెక్ట్ కోసం తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. అందులో ఉత్తమ ప్రాజెక్ట్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, అధ్యాపకులు ఎ.శ్రీనివాస్, పి.రవికుమార్, కె.సూర్యారావు, ఎం.రామకృష్ణ, ఎస్.సుబ్రహ్మణ్యం, వి.భారతి పాల్గొన్నారు.

●పూసపాటిరేగ: మండలంలో కోనాడ జంక్షన్‌లోని ఆర్డర్ పాఠశాలలో శుక్రవారం సైన్స్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు రాజ్‌కుమార్, పాపినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు 300 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్ట్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వి.వి.రమణ, ప్రిన్సిపాల్ సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమానికి పెద్దపీట

(ఐదో పేజీ తరువాయి)

బడ్జెట్‌లో రూ.2,800 కోట్లు కేటాయించడంతో త్వరలోనే జిల్లాలో వాటి పనులు పునఃప్రారంభం కానున్నాయి.

● ఐటీడీఏల పరిధిలో గిరిజనులకు సబ్సిడీలపై రుణాలు అందించేందుకు, వారి జీవన స్థితిగతులను మెరుగుకు, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. వాటి కోసం సుమారు రూ.8,159 కోట్లు కేటాయించారు. ● సూపర్ సిక్స్‌లో హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, తదితర పథకాలకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో లక్షా 40 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

ప్రజలకు తెలియజేయండి

● ఎమ్మెల్యేకి నిర్దేశించిన సీఎం చంద్రబాబు

రాష్ట్ర బడ్జెట్ వివరాలను ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలకు నిర్దేశించారు. బడ్జెట్ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సీటు సంపాదించాలనే లక్ష్యంతో అంతా పనిచేయాలన్నారు. పార్టీ పటిష్ఠత కోసం నిరంతరం శ్రమించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. త్వరలోనే ఎమ్మెల్యేలతో ముఖాముఖి నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా..



గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ అల్ప సంఖ్యవర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. వైద్యం విద్య, వ్యవసాయం రంగాలతో పాటు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలను అమలుకు బడ్జెట్ లో నిధులు కేటాయించడం ఎంతో ఆనందంగా ఉంది.

- బోనెల విజయచంద్ర, ఎమ్మెల్యే, పార్వతీపురం

అన్ని వర్గాలకు అనుకూలం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉంది. కూటమి ప్రభు త్వం అంకితభావంతో పనిచేస్తున్నట్టు బడ్జెట్‌లో నిధులు కేటాయింపుతో స్పష్టమవుతుంది. రాష్ట్ర అభివృద్ధి.. ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుంది.

- ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

కేటాయింపులు పెంచాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మరింతగా కేటాయింపులు పెంచాల్సి ఉంది. మొత్తం బడ్జెట్‌లో పాఠశాల విద్యా రంగానికి కేటాయించింది 9.86 శాతమే. గతంతో పోలిస్తే 2 శాతం తగ్గింది. మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు, రవాణా సౌకర్యం వంటి ప్రక్రియలు జరగాలంటే కేటాయించిన నిధులు చాలవు. కొఠారీ కమిషన్ చెప్పిన విధంగా కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి.

- మురళీమోహన్‌రావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, బెలగాం

ఆశాజనకంగా లేదు

రాష్ట్ర బడ్జెట్ ఆశాజనకంగా లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలు, ఈఏలు, ఏపీజీఎల్ఐపీఎఫ్, లీవులకు కేటాయింపులు లేకపోవడం విచారకరం. ఎంతో ఆశతో ఎదురుచూసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు బడ్జెట్ నిరాశ మిగిల్చింది.

- అమరాపు సూర్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

అన్ని వర్గాలకు మేలు చేసేలా బడ్జెట్

పాలకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు మేలు చేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు తెలిపారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంపై లోతుగా అవగాహన వచ్చాక రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి బాటలు వేశారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు జాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యాన్ని కాపాడుదాం

బలిజిపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసి పాడి పశువులను రక్షించుకుందామని పశువైద్యాధికారి గణేష్ అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. శనివారం నుంచి 30వ తేదీ వరకు పశువులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. గాలికుంటువ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం, నోటి నుంచి తీగ మాదిరి చొంగ కారుతుందని, కొద్దిపాటి ఎండకు కూడా ఓర్చుకోలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వీటివల్ల పాల ఉత్పత్తి, పని సామర్థ్యం తగ్గిపోతుందని, పాలు తాగే దూడల్లో మరణాలు ఉంటాయని ఆయన వివరించారు. అలాగే బ్రూసెల్లోసిస్ వ్యాధి వల్ల జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మగ పశువుల్లో వృషణాల వాపు, కీళ్లవాపులు వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. నెల రోజులపాటు నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ● బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశు వులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని మండల పశు వైద్యాధికారి ఎల్.సుధాకర్ అన్నారు. ఈసందర్భం గా ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మార్చి 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివా రణ టీకాలు, ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తా మని తెలిపారు.

శ్రీనివాసరావుకు కలెక్టర్ కృతజ్ఞతలు



శ్రీనివాసరావును సన్మానిస్తున్న కలెక్టర్

పార్వతీపురం/ టౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తోటపల్లిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు వచ్చిన పార్వతీపురం పట్టణానికి చెందిన గోకవరపు శ్రీనివాసరావును కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సన్మానించారు. శుక్రవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో గోశాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అయితే గోశాల ప్రహరీ, బోరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీనివాసరావు ముందుకు వచ్చారని తెలిపారు. ఈసందర్భంగా ఆయన్ని సన్మానించారు.

ప్రజా అవసరాలకే బ్యాంకులు

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకే బ్యాంకులు ఏర్పడ్డాయని జడ్పీ కార్య నిర్వాహణాధికారి అక్షయకుమార్ ఖెముండి అన్నారు. ఆజాదీకి అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం స్థానిక అశోక్ హోటల్‌లో నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలకు బ్యాంకులే ఆధారమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉత్కళ గ్రామీణ బ్యాంకు డిప్యూటీ ఆర్ఎం సారక్ చోట్రాయ్, ఎస్‌బిఐ ఆర్ఎం ప్రకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. జరడ ఘాట్ రోడ్డు

● విరిగి పడుతున్న కొండ చరియలు ● ఇబ్బందులు పడుతున్న పది గ్రామాల గిరిజనులు

● చర్యలు తీసుకున్నా ప్రయోజనం శూన్యం



ఇదీ జరడ ఘాట్ రోడ్డు పరిస్థితి

కురుపాం రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం-జరడ గ్రామాల మధ్య తొమ్మిది కిలోమీటర్ల మేర ఉన్న ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి పూర్తిగా కొండల మధ్య ఉండడంతో తరచూ కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో ఇక్కడి గిరిజనులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ ఘాట్ రోడ్డుకు అప్పుడప్పుడు మరమ్మతులు చేపడుతున్నారు. కానీ సత్ఫలితాలు ఇవ్వడం లేదు. కొండచరియలు విరిగి పడకుండా చర్యలు తీసుకోవడం, లోయవైపు రిటైనింగ్ వాల్ నిర్మించడం వంటి చర్యలు ద్వారా మాత్రమే ఘాట్ రోడ్డుపై ప్రయాణానికి అనువుగా ఉంటుందంటూ జరడ సర్పంచ్ ఊయక జ్యోతి తెలిపారు. ఈ రోడ్డు బాగు కోసం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి, వినతి పత్రం ఇస్తామని జ్యోతి చెప్పారు. ఈ రోడ్డును బాగు చేస్తే జరడ పంచాయతీ పరిధిలోని పది గ్రామాల ప్రజలకు మేలు చేకూరుతున్నారు.

కార్మికుల సంఖ్యను పెంచండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రాజాం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణం విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కార్మిక నాయకుడు రామ్మూర్తి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాజాం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005లో రాజాం నగర పంచాయతీగా రూపాంతరం చెందిందని, ప్రస్తుతం మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ అయ్యిందని అయి నా సరే కార్మికుల సంఖ్యలో ఏమాత్రం మార్పు లేదన్నారు. పెరిగిన పట్టణానికి, జనాభాకు అనుగుణంగా కార్మికుల్ని నియమించాలన్నారు.

విద్యుత్ స్తంభాల చోరీపై కేసు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏవోబీ కొఠియా గ్రూపు దిగువశెంబి గ్రామం వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలను చోరీ చేసి తరలించే ఘటనపై కేసు నమోదు చేసినట్టు సాలూరు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి చెప్పారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఏవోబీలో దిగువశెంబి వద్ద రెండు ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే ఈ ఇనుప స్తంభాలు గత ఆరు నెలలుగా అక్కడే ఉండగా.. వాటిని మడతపెట్టి బొడ్డవలసకు చెందిన మహేష్, మరో వ్యక్తి రామస్వామితో కలిసి, అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. ఈ ఆటోను గంగన్నదొరవలస విద్యుత్ సిబ్బంది పట్టుకున్నారన్నారు. ఈ సంఘటనపై సాలూరు ఏపీఈపీడీసీఎల్ ఏఈ బి.నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గొలుసు దొంగతనాల నివారణకు చర్యలు



డ్రోన్‌లో సమాచారం తెలుసుకుంటున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకునేందుకు డ్రోన్ సహాయంతో ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ పి.రమేష్‌నాయు డు తెలిపారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల చినమేరంగి, వీరఘట్టాం, గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో ఓ వ్యక్తి గొలుసు దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. ఆ వ్యక్తిని పట్టుకునేందుకు తీవ్రంగా గాలిస్తున్నామని చెప్పారు. తనతో పాటు సీసీఎస్ ఏఎస్ఐ బెడ్సన్, హెచ్‌సీ రామకృష్ణ, డ్రోన్ హ్యాండిలర్ దేముడుబాబు ఉన్నారని చెప్పారు. ఈమేరకు శుక్రవారం వివిధ ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేశారు. ఎరికైనా సమాచారం తెలిస్తే 100గానీ 112 గానీ ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన సూచించారు.

రైల్వే ఆస్తుల పరిరక్షణకు చర్యలు

సాలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామని ఆ శాఖ ఏఈ డి.సురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాలూరు పట్టణ సమీపంలో రైల్వే స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ట్రాక్‌కు రెండు వైపుల ఉన్న రైల్వే స్థలాలకు కొలతలు వేసి బౌండరీలు ఏర్పాటు చేశారు. రైల్వే స్థలాలను ఎవరూ ఆక్రమించినా చట్టపరంగా శిక్షార్హులు అవుతారని స్పష్టం చేశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ పి.సుదర్శనరావు సూచించారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం కార్డుదారులు కుటుంబ సభ్యులతో కలిసి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రేషన్ డీలర్ ఈపాస్ మిషన్ వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మార్చి 10, 17, 24 తేదీల్లో విధులు బహిష్కరణ చేయనున్నట్టు జిల్లా వైద్యసేవ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ప్రదీప్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా మేనేజరు రాంబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని ఇన్సూరెన్స్ పథకంలోకి మార్చిన నేపథ్యంలో అందులో పనిచేస్తున్న సిబ్బంది 17 ఏళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రస్టు ఫీల్డ్ సిబ్బంది వన్‌టైం ఎగ్జామ్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. చనిపోయిన సిబ్బంది కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో టీం లీడర్లు భాను, ముత్యాలనాయుడు, వైద్యమిత్రలు ఫైడపునాయుడు, మహేష్, బంగారునాయుడు, పావని పాల్గొన్నారు.

జిల్లాలో సుస్థిర ఆర్థిక వృద్ధికి చర్యలు

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుస్థిర ఆర్థిక వృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఆర్థిక పురోగతిపై నీతి ఆయోగ్ సభ్యులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని, వారితో మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన, పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో ఆర్థిక వృద్ధి చెందేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగంలో ఆర్థికవృద్ధి సాధించేలా ఐదు ముఖ్య పంటలు ఉన్నాయని.. వాటిలో జీడి, అరటి, చింతపండు, పైనాపిల్, చిరుధాన్యాలు ప్రధానమన్నారు. ఈ పంటలతో ఇప్పటికే అధిక లాభాలు ఆర్జిస్తున్నారని, వీటిని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలో పర్యాటక రంగంలో మంచి వృద్ధి సాధించేందుకు అవకాశం ఉందని, ఆ దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. వీటితో పాటు పార్కుల అభివృద్ధి, వేర్ హౌసింగ్ యూనిట్ల కల్పన, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీఈవో తిరుపతినాయుడు

● సైన్స్ ఎగ్జిబిషన్ల పరిశీలన



బీజే పురం హైస్కూల్‌లో విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో తిరుపతినాయుడు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు అన్నారు. మండలంలోని జియ్యమ్మవలస, బీజే పురం ఉన్నత పాఠశాలల్లో సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన ఎగ్జిబిషన్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సి, డి గ్రేడలలో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి మంచి మార్కులు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈయన వెంట ఎంఈవో-2 ముదిలి శ్రీనివాసరావు, జియ్యమ్మవలస, బీజే పురం హైస్కూల్స్ హెచ్ఎంలు కేపీఎస్ కుమార్, రఘురామరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న రఘుకుమార్

కురుపాం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయాలని రాష్ట్రీయ బాలల సంరక్షణ కార్యక్రమం ప్రోగ్రాం అధికారి రఘుకుమార్ అన్నారు. వలసబల్లేరు గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటరును ఆయన శుక్రవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. వసతి గృహాల్లో ఉండే బాలలకు తరచు గా వైద్య పరీక్షలు నిర్వహించాలని మొండెంఖల్ వైద్యాధికారిణి ప్రజ్ఞకు సూచించారు. ఎస్‌సీడీసీడీ సర్వే తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారిణి ప్రజ్ఞ, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపండు కొనుగోలు ప్రారంభం



చింతపండు కొనుగోలు చేస్తున్న జీసీసీ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ ద్వారా శుక్రవారం గిరిజన రైతుల నుంచి చింతపండు కొనుగోలు ప్రారంభించారు. కిలో చింతపండు ధర రూ.36గా ప్రకటించారు. మొదటిరోజు లోవముఠా ప్రాంతంలో 30 క్వింటాళ్ల చింతపండును కొనుగోలు చేసినట్టు జీసీసీ మేనేజర్ కృష్ణప్రసాద్ తెలిపారు. తాడికొండ, వంగర, కేదారపురం, పెద్దకర్జ, గుమ్మలక్ష్మీపురం, గొరోడా, దుడ్డుఖల్లు, రేగిడి, నీలకంఠాపురం, మండెమ్మకళ్లు, జి.సెవడా తదితర కొనుగోలు కేంద్రాల ద్వారా చింతపండు, కరక్కాయలు, కొండచీపుర్లు తదితర అటవీ ఫలసాయాలను కొనుగోలు చేస్తున్నట్టు మేనేజర్ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ పారిశుధ్య నిర్వహణపై ఈ వేసవి కాలంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మార్చి మొదటివారం నుంచి 30 వార్డుల్లోనూ ప్రత్యేక పారిశుధ్య అవగాహన కార్యాక్రమాలను నిర్వహించేందుకు కార్యచరణ చేస్తున్నామని చెప్పారు.

సాగు భూముల్లో ఉపాధి పనులు వద్దు

● మెట్టసబ్బన్నపేట గ్రామస్థుల వినతి



తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

భోగాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సాగు భూముల్లో ఉపాధి పనులు చేపట్టవద్దని మెట్టసబ్బన్నపేట గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సుమారు 33 ఏళ్ల కిందట తమకు ఏడెకరాల భూమిని తాత్కాలిక సాగు నిమిత్తం ఇచ్చిందని తెలిపారు. అదే భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ భూముల్లో ఉపాధి పనులు చేపట్టాలని చూస్తే అడ్డుకున్నామని చెప్పారు. అయితే ప్రస్తుతం మళ్లీ స్థానిక నాయకుల ఒత్తిడితో ఉపాధి పనులు చేపడుతున్నారన్నారు. సాగు భూముల్లో ఉపాధి పనులు నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన జమ్మాదేవి గురుకులం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ సైన్స్‌డే సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారు. విజయవాడలో మంత్రా సంస్థ బుధవారం నిర్వహించిన ప్రాజెక్టు బేస్డ్ కం లెర్నింగ్ పోటీల్లో అవార్డులు సొంతం చేసుకున్నారు. గణితంలో డిజైన్ యువర్ ఓన్ ఫర్నీచర్‌కి, బయలాజికల్ సైన్స్‌లో సెటప్ యువర్ ఓన్ ఫార్మసీకి ఉత్తమ అవార్డులు దక్కాయని ప్రిన్సిపాల్ పాత్రో తెలిపారు. సర్ సీవీ రామన్ ఎఫెక్ట్ కోసం విద్యార్థులు ప్రయోగ పూర్వకంగా వివరించారన్నారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ కోతతో ఇబ్బందులు

పాలకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాలకొండ-నవగాం విద్యుత్ లైన్ శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బ్రేక్‌డౌన్ అయింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో వీరఘట్టం, పాలకొండ మండలాల్లో సుమారు 28 పంచాయతీల ప్రజలు విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జరిమానా

పాచిపెంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో సాలూరు జేఎఫ్‌సీ మెజిస్ట్రేట్ వి.కనకలక్ష్మి ఇద్దరికి జరిమానా విధించారని స్థానిక ఎస్ఐ కె.వెంకటసురేష్ శుక్రవారం తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారని చెప్పారు. రెండోసారి డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే మూడు నెలల జైలు శిక్ష విధిస్తామని మెజిస్ట్రేట్ హెచ్చరించారని ఎస్ఐ తెలిపారు.

యువతకు కంప్యూటర్ శిక్షణ

కురుపాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): యువతకు 90 రోజులు కంప్యూటర్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కురుపాం ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సీతంపేట వైటీసీ భవనంలో ఎస్టీ, ఎస్సీ, బీసీ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. రోజుకు రూ.300 స్టయిఫండ్ ఇస్తారని తెలిపారు. ఆసక్తిగల వారు మార్చి 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు గ్రామ సచివాలయంలో సంప్రదించాలని కోరారు. మార్చి 15వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ఉంటాయని ఆయన తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మక్కువ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత దృష్ట్యా మండలంలోని 21 పంచాయతీల గ్రామాల్లో శనివారం నుంచి 45 రోజుల పాటు క్రాస్ ప్రోగ్రాం చేపడుతున్నట్టు ఎంపీడీవో డీడీ స్వరూపారాణి తెలిపారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఉన్న 426 బోర్లు సక్రమంగా పనిచేయనట్టయితే మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో ఎటువంటి తాగునీటి సమస్యలు ఎదురైనా సంబంధిత సచివాలయాల సిబ్బందికి తెలియజేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజూ గ్రామాల్లో బోర్లు మరమ్మతులు నిర్వహిస్తామని వివరించారు.

పరిహారం చెల్లించాలని వినతి

సీతానగరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బూర్జ రెవెన్యూ పరిధిలో గల తోటపల్లి కాలువలో భూమి కోల్పోయిన 25 మంది డీపట్టా భూమి రైతులకు పరిహారం చెల్లించాలని వారు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ ప్రసన్నకుమార్‌ను కలిసి, వినతి పత్రం అందజేశారు. జిరాయితీ భూమి రైతులకు పరిహారం చెల్లించారు కానీ.. డీపట్టా భూమి రైతులకు డబ్బులు అందజేయాలని వారు వాపోయారు.

హామీలు ఏమయ్యాయి?

పాలకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని వైసీపీ ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల విభాగం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దు లిల్లీ పుష్పనాథం ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటో తేదీన పింఛన్లు, జీతాలు ఇస్తామని ప్రగ్భాలాలు పలికారని, కానీ ఇప్పటివరకు ఆ హామీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటాలు చేస్తామన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

వీరఘట్టం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ఉపాధి హామీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత ఇంకుడుగుంతలు నిర్మాణం, పంట కుంటల నిర్మాణం, గోశాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని, వేతనం రూ.300 అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వెంకటరమణ, ఏపీవో జి.సత్యం నాయుడు, సాంకేతిక సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.